సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 5 । జనవరి । 2024



జాతరలో వెలుగులు - 8లో

మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరలో నిరంతరం విద్యుత్ వెలుగులు అందించేందుకు కృషి చేయాలని ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు .



డివిడెండ్, స్కాలర్‌షిప్‌లివ్వాలి

ప్రతీ సంవత్సరం జూలైలో చెల్లించాల్సిన షేర్ హోల్డర్స్ పెండింగ్ డివిడెండ్ రైల్వే కార్మికుల పిల్లల స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని రైల్వే సీసీఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
30⁰/16⁰

వాతావరణం


ఉష్ణోగ్రతలు తగ్గడంతో జిల్లాలో ఉదయం చలితో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ పొగ మంచు కురుస్తుంది.

ఎమ్మెల్యే అభ్యర్థులకు పోలీసుల ఫండ్!

ఫైరవీ పోస్టింగ్‌ల పదిలం కోసం...

కమిషనరేట్ పరిధిలో ఆరా తీస్తున్న ఇంటెలిజెన్స్

- ఎన్నికల సమయంలో నిధులు సమకూర్చిన కొందరు పోలీసులు
- పోస్టింగ్‌లు కాపాడుకునే ప్రయత్నంలో కాక
- బెడిసికొట్టిన కొందరు ఇన్‌స్పెక్టర్ల అత్యుత్సాహం
- పోలీసు ఉన్నతాధికారులకు గెలిచిన ఎమ్మెల్యేల ఫిర్యాదు



సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థులకు 'ఎలక్షన్ ఫండ్'ఇచ్చిన కొందరు పోలీసు అధికారుల వ్యవహారంపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుండడం ఆ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. గత ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యేల లేఖలతో పోస్టింగ్‌లు పొంది.. ఆ పోస్టింగ్‌ల్లోనే కొనసాగేందుకు చేసిన ప్రయత్నం వికటించింది. అధికారంలో ఉన్నవారు కాకుండా ఆ స్థానాల్లో ఇతరులు గెలుపొందడంతో ఆలస్యంగా బయటకు వచ్చిన ఎలక్షన్ ఫండ్ వ్యవహారంపై తాజా ఎమ్మెల్యేలు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. డబ్బులు సమకూర్చడంతోపాటు అప్పటి ఎమ్మెల్యేలకు సహకరించారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఇంటెలిజెన్స్ అధికారులు రెండు రోజులుగా కూపీ లాగుతుండడం పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నిఘావర్గాల ఆరాతో కలకలం..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఎనిమిది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉంటే.. వారి స్థానంలో ఈసారి ఆరుగురు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోటీలో లేకపోగా.. వారి స్థానంలో ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలిచారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాలకు చెందిన ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఏసీపీ బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఎన్నికల ఫండ్ కింద నిధులు సమకూర్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రచారంపై స్పందించిన కొందరు ఎమ్మెల్యేలు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. సమగ్ర నివేదిక కోసం ఇంటెలిజెన్స్ వర్గాలను రంగంలోకి దింపారు. ఈ వ్యవహారంపై నిఘా వర్గాలు ఆరా తీస్తుండడం'పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు బీఆర్‌ఎస్ నాయకులు సామాజిక సమీకరణాలతో పోలీస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. చాలాచోట్ల నాయకుల సామాజికవర్గానికి చెందిన అధికారులను వారి నియోజకవర్గాల్లో పనిచేసేలా చూసుకున్నారని ఆ శాఖలోని కొందరు అప్పట్లో బహిరంగంగానే చర్చించుకున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు కొన్ని పోస్టింగ్‌ల్లో వారి సామాజిక వర్గానికి చెందిన అధికారులకు ప్రాధాన్యమిచ్చినట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు పలువురికి ఈ కోణంలో కూడా పోస్టింగ్‌లు దక్కినట్లు చర్చ ఉంది. వీటిపైన కూడా ఉన్నతాధికారులు, నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలు మరో ఆరునెలల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బదిలీల్లో భాగంగా పలువురు ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడాదినుంచే పోలీసుల బదిలీల ప్రక్రియ సాగింది. ఈక్రమంలో చాలామంది ఇతర జిల్లాల నుంచి కమిషనరేట్ పరిధి మంచి ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ తిరిగి సాధించారు. ఇందులో పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధి హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలు ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో మంత్రి, ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు ప్రాతినిధ్యం వహించారు. కోరుకున్న చోట పోస్టింగ్‌లకు ఆ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే లెటర్ తప్పనిసరి. దీంతో కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి లెటర్లు సంపాదించి ఈ మూడు జిల్లాల పరిధిలో పోస్టింగ్‌లు పొందారన్న చర్చ పోలీసువర్గాల్లోనే ఉంది. పోస్టింగ్ పొందిన ఆరు నుంచి తొమ్మిది నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడం సంకటంగా మారింది. పైరవీలతో పోస్టింగ్ పొందిన కొద్ది రోజులకే ఎన్నికలు రావడం.. ఎలాగైనా మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందన్న నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థులు కొందరికి ఎన్నికల ఫండ్ ఇచ్చిన వైనం బయటకు రావడం చర్చనీయాంశమవుతోంది.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి


కలెక్టర్ సిక్తాపట్నాయక్



సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధి గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులైన ఓటర్లు ఫిబ్రవరి 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1, నవంబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండినవారు తమ పట్టభద్ర ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. పూరించిన పత్రాలు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుందని, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ముసాయిదా ఫిబ్రవరి 24న ఉంటుందని, ఏప్రిల్ 4న తుదిజాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, కాంగ్రెస్ నుంచి ఈవీ శ్రీనివాస్‌రావు, బీజేపీ నుంచి రావు అమరేందర్‌రెడ్డి ఇతర పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఎంజీఎంలో కరోనా పాజిటివ్ కేసు



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో గురువారం మరో కరోనా పాజిటివ్ కేసు నమోదైనట్లు ఆస్పత్రి పాలనాధికారులు తెలిపారు. గత నెల 21 నుంచి గురువారం వరకు 28 పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కరోనా వార్డులో నలుగురు మాత్రమే చికిత్స పొందుతున్నట్లు వారి పరిస్థితి కూడా మెరుగ్గానే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

'ప్రజా పాలన' దరఖాస్తులకు రేపే చివరి గడువు

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం ఈనెల 6వ తేదీతో ముగియనుంది. దరఖాస్తులు సమర్పించేందుకు రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. గురువారం 6వ రోజు అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. 66 డివిజన్లలో ఒక్కరోజే మొత్తం 33,440 దరఖాస్తులు రాగా.. వాటిలో జనరల్ దరఖాస్తులు 5,767, రేషన్ కార్డుల కోసం 5,650 దరఖాస్తులు నమోదయ్యాయి.

వేతనాలు పెంచాలని ఆందోళన



ఎంజీఎం: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ... ఎంజీఎంలో విధులు నిర్వర్తిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో అర్ధగంట పాటు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ జీఓ ప్రకారం.. కార్మికులకు రూ.12వేలు వేతనం అందించాల్సి ఉన్నా.. తమకు రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని అయినా ఎంజీఎం పాలనాధికారులు పట్టించుకోవట్లేదన్నారు. ఉండాల్సిన కార్మికుల కన్నా.. తక్కువ మంది కార్మికులతో పని చేయించడం వల్ల ప్రస్తుతం విధుల్లో ఉన్న కార్మికులపై భారం పడుతోందన్నారు. ఈవిషయమై ఎంజీఎం పాలనాధికారులకు తెలిసినా.. ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ డిమాండ్లను పరిష్కరించాలని లేకపోతే పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి ఆందోళన చేపడతామని పరిపాలనాధికారులను హెచ్చరించారు.

హాకీ క్రీడాకారుడిని అభినందించిన సీపీ



వరంగల్ క్రైం: స్కూల్ గేమ్స్‌లో హాకీ క్రీడ జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న మహ్మద్ అబ్దుల్ హన్నన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఆయన కార్యాలయంలో అభినందించారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తనయుడు అబ్దుల్ హన్నన్. గత నెల 28 నుంచి జనవరి 1 వరకు మధ్యప్రదేశ్, గ్వాలియర్‌లో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్‌లో మన రాష్ట్రం తరపున హాకీ జట్టులో పాల్గొన్నాడు. జట్టు గెలుపులో కీలకంగా వ్యవహరించాడు. ఈసందర్భంగా జాతీయస్థాయి సర్టిఫికెట్‌ను మరోసారి సీపీ చేతుల మీదుగా అందుకున్నారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్‌ను సీపీ అభినందించారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ల మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారం అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా బంద్ ఉంటుందని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారిపేట వద్ద పైప్‌లైన్ లీకేజీ కారణంగా అంతరాయం కలుగుతుందని, దీంతో అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, ఖిలా వరంగల్ తూర్పు కోట, మధ్య కోట, ఎస్‌ఆర్‌ఆర్ తోట, ఎసీరెడ్డి నగర్, నాగమయ్య గుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు. మరమ్మతుల అనంతరం యాధావిధిగా షెడ్యూల్ ప్రకారం నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలకు ఆహ్వానం

రామన్నపేట: ఈనెల 8న నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'మై భారత్-వికసిత్ భారత్ 2047' అంశంపై ఏవీవీ జూనియర్ కళాశాలలో ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర వరంగల్ అధికారి చింతల అన్వేష్ తెలిపారు. 1995 జనవరి 12 నుంచి 2009 జనవరి 12 మధ్య జన్మించిన వారు ఈపోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పోటీ ఉంటుందని, జిల్లా స్థాయి ప్రథమ విజేతను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని, విజేతకు ప్రశంసపత్రం, జ్ఞాపిక అందజేస్తామన్నారు. పోటీల్లో ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఈనెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 99630 23009 నంబర్ ద్వారా గూగుల్ షీట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పోలీస్ కమిషనర్ అంబర్‌కి షోర్ ఝా, ఆర్వోలు రిజ్వాన్ బాషా, అశ్విని తానాజీ వాకడే, కృష్ణవేణి, అధికారులతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికలను ఎన్నికల కమిషన్‌కు పంపాలని చెప్పారు. సమావేశంలో ఏసీపీలు కిషన్, తిరుమల్, సతీష్‌బాబు, జితేందర్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి..

అభివృద్ధి పనుల కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నిబంధనల ఆధారంగా మూడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, భూములు కోల్పోతున్న రైతుల నుంచి అభ్యంతరాలను పరిశీలించాలని పేర్కొన్నారు. సమావేశంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు వాసుచంద్ర, కృష్ణవేణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య

వరంగల్ జిల్లాలోని గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించి మాట్లాడారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గురుకులాల సమన్వయ అధికారి సమ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, సూపరింటెండెంట్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ



బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికా గుప్త

హన్మకొండ: అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్త అన్నారు. హనుమకొండలోని జెడ్పీ కార్యాలయంలో తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లా స్థాయి ఉద్యోగులు లూయిస్ బ్రెయిలీ జయంతిని జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త జ్యోతి ప్రజ్వలన చేసి బ్రెయిలీ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంధుల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా అతిథులు 2024 బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా క్యాలెండర్ దాత వైఎస్‌ఆర్ కృష్ణ, కనకలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ, వరంగల్ జిల్లా సంక్షేమాధికారి శారద, ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్, ప్రమోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటరాం రెడ్డి, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి, తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజు, నాయకులు ఎల్.రవీందర్, ఎస్.నాగయ్య, ఎం.రాజ్‌కుమార్, వై.నరేశ్, ఎస్.కృష్ణయ్య, డి.రేణుక, జి.ఉదయచంద్రిక కుమారి, బి.కార్తీక్, సీహెచ్.కమల, జి.విజయచందర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వం ఇస్తున్న టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

విద్యారణ్యపురి: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తున్నామని టీఎన్‌జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎ.రాజేందర్ అన్నారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు తాము నిత్యం అందుబాటులో ఉంటామని ఏ సమస్య వచ్చినా.. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టీఎన్‌జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం అధ్యక్షుడు కలకోట్ల భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం కార్యదర్శి రాజేశ్వర్, టీఎన్‌జీఓస్ కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శ్యామ్‌సుందర్, రామునాయక్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, రాజీవ్‌కన్నా, మిస్బాప్రణయ్, సుధాకర్, సూపరింటెండెంట్ ఆనందబాబు, సతీశ్, ఫోరం బాధ్యులు జైవీర్, అలీ, శ్రీనివాస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం ఉద్యోగులు పాల్గొన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం ఉద్యోగులు టీఎన్‌జీఓస్ యూనియన్ మెంబర్‌షిప్ తీసుకున్నారు.

నగరాభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు

- సమగ్ర సమాచారాన్ని నివేదించాలి
- స్టేక్ హోల్డర్స్ విలువైన సూచనలతోనే సాధ్యం
- ఈప్రాజెక్టుకు వరంగల్, హైదరాబాద్ నగరాలు ఎంపిక
- కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: సమగ్ర ప్రజారవాణా, ప్రణాళిక, ఆర్థికాభివృద్ధి, మాస్టర్ ప్లాన్ కోసం స్టేక్ హోల్డర్స్ (వాటాదారులు) శాస్త్రీయతతో కూడిన సమాచారమందిస్తే కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని, మహానగరాభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు విడుదలవుతాయని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం 'కుడా' మినీ సమావేశ మందిరంలో నగరానికి చెందిన స్టేక్ హోల్డర్స్ విభాగాలైన ఆర్టీసీ, పోలీస్, ఆర్టీఏ, ట్రాఫిక్, ఆర్‌అండ్‌బీ, బల్దియా (స్మార్ట్ సిటీ), కుడా, డీటీసీపీలతో కన్సల్టెంట్ లీ అసోసియేట్స్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా లీ అసోసియేట్స్ ప్రతినిధుల సమగ్ర సమాచారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా.. కమిషనర్ హాజరై పలు సూచనలిచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విజన్-2050లో భాగంగా సంబంధిత పట్టణ సంస్కరణలు, పునరుద్ధరణలో భాగంగా సమగ్ర ప్రజారవాణా ప్రణాళిక (సీఎంపీ) ఎకనామిక్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఈడీపీ)తో పాటు భూ వినియోగ ప్లాన్ (లాండ్ యుజ్, నీటి కొలనుల ప్లాన్)లను మాస్టర్ ప్లాన్-2048లో పొందుపర్చాల్సి ఉందన్నారు. ఈసమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తే నగరాభివృద్ధి కోసం రూ.50 కోట్లు నిధులు అందజేస్తారని తెలిపారు.

రెండు నగరాలు ఎంపిక..

తెలంగాణ నుంచి హైదరాబాద్, వరంగల్ నగరాలకు మాత్రమే ఈప్రాజెక్ట్‌లో చోటు దక్కిందని కమిషనర్ తెలిపారు. హైదరాబాద్‌తో పోలిస్తే.. గ్రేటర్ వరంగల్ పురోగతిలో ముందుందన్నారు. సమావేశంలో 'కుడా' సీపీఓ అజిత్‌రెడ్డి ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలత, డీటీఓ ఆఫ్రిన్ సిద్దిఖీ, బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ భోజరాజు, లీ అసోసియేట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పన్నీరు సెల్వం, ఆర్‌అండ్‌బీ డీఈ, ఎన్ఐటీ ప్రొఫెసర్ ప్రసాద్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మహానగర వ్యాప్తంగా.. వివిధ శాఖల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. 'కుడా' కార్యాలయంలో గ్రేటర్ టౌన్ ప్లానింగ్, శానిటేషన్, హెల్త్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్ఓ రాజేశ్, డీసీపీ ప్రకాశ్ రెడ్డి, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సంజయ్‌కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయండి

నయీంనగర్: వేగంగా పనులు పూర్తి చేయాలని 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా పరిధి రాంపూర్-పెద్దపెండ్యాల-చిన్నపెండ్యాల వరకు నిర్మించిన సెంట్రల్ మీడియమ్ పనుల్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఓఆర్‌ఆర్ నుంచి పెగడపెల్లి వరకు నూతనంగా నిర్మించిన 1.6 కిలోమీటర్ల రోడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కుడా హార్టికల్చర్ అధికారి వేణుగోపాల్, బల్దియా హెచ్ఓ రమేశ్, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ - గొర్రెకుంట రోడ్డు గుంతలమయం

- మరమ్మతులు చేసిన ఆరునెలలకే పూర్వ స్థితికి..
- నాణ్యతపై దృష్టిపెట్టని ఇంజనీరింగ్ అధికారులు
- అభివృద్ధి చేయాలని కార్మికుల వినతి



ప్రమాదకరంగా మారిన మార్కెట్ రోడ్డు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ మొదటి గేట్(పోలీస్‌స్టేషన్) పక్క నుంచి గొర్రెకుంట, ధర్మారం, తదితర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలు, జిన్నింగ్ మిల్లులకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దాంతో వ్యాపారులు, రైతులు, వాహనాల డ్రైవర్లు, కార్మికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భద్రాచలం, నర్సంపేట, మహబూబాబాద్ తదితర ప్రాంతాల నుంచి పత్తి, మిర్చి, అపరాలను వరంగల్ మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చే వాహనాలు ఎక్కువగా నర్సంపేట, గొర్రెకుంట మీదుగా వ్యవసాయ మార్కెట్ వరకు ఉన్న రోడ్డు నుంచే వస్తాయి. ఉదయం 9గంటల తర్వాత భారీ లోడ్ వాహనాలు నగరంలోకి ప్రవేశించేందుకు ట్రాఫిక్ ఆంక్షలు ఉన్న నేపథ్యంలో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు మార్కెట్‌కు వస్తుంటాయి. వాటికి తోడు గ్రానైట్, ఇసుక లారీలు కరీంనగర్, ఏటూరునాగారం, భూపాలపల్లి ప్రాంతాల నుంచి ఇదే రోడ్డుపై నుంచి ఆరెపల్లి, గొర్రెకుంట మీదుగా నర్సంపేట వైపునకు వెళ్తుండడంతో రోడ్డు మొత్తం పాడైపోయింది. ఈరోడ్డు వెంట సుమారు 8కోల్డ్ స్టోరేజీలు, 8జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ముఖ్యంగా గణపతి కాంటా నుంచి విజేత కోల్డ్ స్టోరేజ్ ఉన్న గుంతల రోడ్డులో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన సరుకులను అడ్తి వ్యాపారులు కోల్డ్‌స్టోరేజీలు, జిన్నింగ్ మిల్లులకు మార్కెట్ నుంచి ఎడ్ల బండ్లు, డీసీఎంలు, టాటా మ్యాజిక్ వాహనాల్లో తరలిస్తారు. ఈక్రమంలో వాహనాలు పాడైపోవడమే కాకుండా తరచూ కార్మికులు ప్రమాదాల బారినపడుతూ గాయాలపాలవుతున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును అభివృద్ధి చేయాలని వ్యాపారులు, కార్మికులు కోరుతున్నారు.

పనుల్లో లోపించిన నాణ్యత

మార్కెట్ నుంచి గొర్రెకుంట వరకు ఉన్న రోడ్డు మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పనులు చేపట్టిన ఆర్నెళ్లకే రోడ్డు పూర్వస్థితికి వచ్చిందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. మూడేళ్ల క్రితం సుమారు రూ.4కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టగా.. మూడు నెలలకే గుంతలు పడ్డాయి. ఈ పనులను మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన ఏజెన్సీ చేపట్టడంతో అధికారులు నోరు ఎత్తకుండా బిల్లులు చెల్లించినట్లు తెలిసింది.

వాహనాలు పాడవుతున్నాయి



మార్కెట్ నుంచి కోల్డ్‌స్టోరేజీలు, పత్తి మిల్లులు ఉన్న ప్రాంతాల్లోని హోటళ్లు, నివాసితులకు పాలు పోస్తాను. ఈ రోడ్డుపై ఉన్న గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు తొందరగా పాడవుతున్నాయి.

- రంజిత్, పాల వ్యాపారి

ప్రమాదాల బారిన పడుతున్నాం..



రోడ్డు మొత్తం గుంతలమయంగా తయారు కావడంతో మిల్లుల్లో, స్టోరేజీల్లో పనిచేసే గుమస్తాలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రైతులు, వ్యాపారులు ఇస్తున్న కిరాయి, జీతం వాహనాల మరమ్మతులకే సరిపోతోంది.

- తోటకూరి పూర్ణచందర్, గుమస్తా

ట్రాఫిక్ ఎస్సైపై విచారణ

వరంగల్ క్రైం: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఓ ఎస్సై గురువారం విధి నిర్వహణ సమయంలో ములుగురోడ్డు వద్ద ఓ వాహనదారుడి నుంచి డబ్బులు తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో ట్రాఫిక్ ఉన్నతాధికారులు.. సదరు ఎస్ఐని విచారిస్తున్నట్లు సమాచారం. సదరు ఎస్సై మరో 8 నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నట్లు తెలిసింది.

పల్లి రైతు పరేషాన్..

వేరుశనగలో 'తెగుళ్ల' గుబులు

- 30 రోజుల దశలో పంట
- ఆందోళనలో రైతులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్ : అన్నదాతలకు 'సాగు' కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పత్తి పంట ఆశించిన మేర దిగుబడి రాలేదు. దీంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా యాసంగిలో వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. అయినా ప్రస్తుతం వారిలో 'తెగుళ్ల' గుబులు మొదలైంది. వేరుశనగ పంట వేసి నెల రోజులు దాటకముందే మొక్కలను తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తుండడం ఆందోళనకు గురి చేస్తోంది. అయితే కొన్ని ప్రాంతాలలో వేరుశనగ వేసి నెల రోజులు దాటుతుండగా మరికొన్ని ప్రాంతాలలో ఇరవై రోజులు దాటినట్లు తెలుస్తోంది. వేసవి దృష్ట్యా సాగునీటి వసతి ఉన్న రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు. అయితే మొక్క దశలోనే తెగుళ్లు, చీడపీడలు కనిపిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెగుళ్లను తొలిదశలోనే నివారించకపోతే నష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

విత్తన శుద్ధి కీలకం..

నేల ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టడానికి విత్తనశుద్ధి కీలకంగా మారనుంది. విత్తన శుద్ధికి టెబ్యుకోనజోల్, మ్యాంకోజెబ్ లాంటి పొడి వాడాలి. కాండం కుళ్లు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో ఇమిడాక్లోప్రైడ్‌ను నీటిలో కలిపి విత్తనాలకు పట్టించాలి. వేరుపురుగు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో క్లోరిపైరిఫాస్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. వరి మాగాణి, కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు ఎకరాకు సరిపడా రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. వేరు, మొదలు, కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడర్మ విరిడిని పట్టించి విత్తుకోవాలి.


పంటను ఆశిస్తున్న పొగాకు లద్దెపురుగు


మొక్కకు సోకిన వేరుకుళ్లు తెగులు



పంటను 30 రోజుల్లో ఆశించే చీడపీడలు–నివారణ

ఆకుముడత..

ఈ పురుగు పంట విత్తిన 15 నుంచి 45 రోజుల వరకు ఆశిస్తుంది. ఈ పురుగు 2–3 ఆకులను గూడుగా మార్చి పచ్చదనాన్ని తినడంతో ఆకులు ఎండిపోయినట్లు కనిపిస్తాయి. పురుగు నివారణ కోసం క్లోరోపైరిఫాస్, ఎసిఫేట్‌ను కలిపి మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

పొగాకు లద్దెపురుగు..

ఈ పురుగులు పగటివేళ మొక్కల అడుగున, మట్టి కింద ఉండి రాత్రి పూట మొక్కలను ఆశిస్తూ నష్టం చేస్తాయి. పిల్ల పురుగులు పత్రహరితం తిని వేయడంతో ఆకులు జల్లెడ మాదిరి కనిపిస్తాయి. ఎదిగిన లార్వాలు రాత్రిపూట ఆకులను పూర్తిగా తిని ఈనెలను మాత్రమే మిగుల్చుతాయి. ఈ పురుగు నివారణ కోసం ఎకరాకు 4–5 లింగాకర్షక బుట్టలు అమర్చాలి. ఎర పంటలుగా పొద్దుతిరుగుడు, ఆముదం లాంటి విత్తనాలు ఎకరాకు 200 మొక్కలు ఉండేలా వేసుకోవాలి. పురుగులు చిన్నగా ఉన్నప్పుడు వేప గింజల కషాయం పిచికారీ చేయాలి. ఎదిగిన లార్వాలను నివారించేందుకు నొవాల్యురాన్, ఫ్లూటెండమైడ్ మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. విషపు ఎర తయారు చేసుకుని సాయంత్రం వేళలో పంటలో చల్లుకోవాలి.

తిక్క ఆకుమచ్చ తెగులు..

విత్తనశుద్ధి చేయని పక్షంలో ఈ తెగులు ఎక్కువగా పంటను ఆశిస్తుంది. పైరు 30 రోజుల దశలోపు ఆశించే ఆకుమచ్చ తెగులులో మచ్చలు ఆకుల పై భాగాన ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ఆలస్యంగా వచ్చే తెగులులో మచ్చలు ఆకు అడుగు భాగాన నల్లని రంగులో ఉంటాయి.ఈ తెగులు ఎక్కువగా ఉన్నప్పుడు ఆకులు మొత్తం ఎండిపోయి రాలిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం టెబ్యుకోనజోల్‌తో విత్తన శుద్ధి చేయడమే కాకుండా క్లోరోథాలోనిల్, టెబ్యుకోనజోల్ మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

మొదలు కుళ్లు తెగులు..

విత్తనశుద్ధి చేయని పరిస్థితులలో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. విత్తనం మొలకెత్తిన తర్వాత నేలకు ఆనుకుని కాండంపై నల్లని శిలీంధ్రబీజాలతో కప్పబడి ఉంటుంది. ఒక్కోసారి విత్తనం మొలకెత్తకుండానే కుళ్లిపోతుంది. కాయలపై కూడా నల్లని మచ్చలేర్పడతాయి. మొక్కలు ఎండిపోయి చనిపోతాయి. వీటి నివారణకు పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలి. టెబ్యుకోనజోల్‌తో విత్తనశుద్ధితోపాటు కార్బండిజం, మాంకోజెబ్ కలిపి మొక్కల మొదళ్ల దగ్గర నేల తడిచేలా పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు తెగులు..

ఈ తెగులు పంట 30 రోజుల దశలో ఉన్నప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది. శిలీంధ్రం నేల ద్వారా వ్యాప్తి చెందుతుంది. పంట మార్పిడి పాటించని పరిస్థితులలో తెగులు ఎక్కువగా వస్తుంది. ఈ తెగులు ఆశించినప్పుడు తల్లి వేరు కుళ్లిపోయి నలుపురంగుకు మారి నుజ్జునుజ్జుగా తయారవుతుంది. నివారణ కోసం తెగులు సోకిన మొక్కల చుట్టూ కార్బండిజం పొడి మందును నీటిలో కలిపి నేల తడిచేలా పిచికారీ చేయాలి.

తామర, పచ్చదీపపు పురుగులు..

సగటు ఉష్ణోగ్రతలు పెరిగి వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ పురుగుల ఉధృతి ఎక్కువవుతుంది. తామర పురుగులు ఆశించిన ఆకుల అడుగు భాగాన ఇనుము రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ పురుగులు కాండం కుళ్లు, మొవ్వ కుళ్లు తెగులును వ్యాపింపజేస్తాయి. పచ్చదీపపు పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో ఆకు కొన భాగాన 'వి'ఆకారంలో పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, వేపనూనె, సబ్బు పొడి, థయోమిథాక్సామ్ లాంటివి అవసరాలను బట్టి మార్చిమార్చి పిచికారీ చేయాలి.

తుప్పు, కుంకుమ తెగులు...

ఈ తెగులు ఉధృతి యాసంగి పంటలో ఎక్కువగా ఉంటుంది. ఆకుల అడుగు భాగంలో ఎరుపు లేదా ఇటుక రంగు గల చిన్న పొక్కులు ఏర్పడతాయి. ఆకు పై భాగంలో పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. నివారణ కోసం క్లోరోథాలోనిల్, మాంకోజెబ్ మందులు కలిపి మొక్కలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

తెగుళ్లను మొదటి దశలోనే నియంత్రించాలి..



యాసంగిలో సాగు చేస్తున్న వేరుశనగ పంట విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంట 30 రోజుల వయసులో ఆశించే తెగుళ్లు, చీడపీడలను మొదటిదశలో నియంత్రించాలి. మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటిలో వస్తున్న మార్పులను గమనించి నివారణ చర్యలు చేపట్టాలి. విత్తనశుద్ధి సక్రమంగా చేపడితే తెగుళ్లను కొంతమేరకు నివారించొచ్చు. కొన్ని నేలలో పంట మార్పిడి కూడా అవసరం ఉంటుంది.

డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

క్లుప్తంగా

కంది పంట క్షేత్ర సందర్శన


కంది పంట క్షేత్ర సందర్శన చేస్తున్న శాస్త్రవేత్తలు

మహబూబాబాద్ రూరల్ : వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సంధ్యాకిశోర్, మధు, వీరన్న, పద్మజ, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.కిశోర్ కుమార్ గురువారం కంది పంట క్షేత్రాలను పరిశీలించారు. కందిలో చిరు సంచి అయిన డబ్ల్యూ.ఆర్.జి.ఈ 182 రకం విత్తనాలను మల్యాల, కురవి గ్రామాల పరిధిలోని రైతులు సాగు చేస్తున్నారు. దీంతో ఆ పంట క్షేత్రాలను సందర్శించి రైతులు ఆశించిన మేర ఆ రకం దిగుబడి, రోగాలు, అనుకూల పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కందిసాగు పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కంది చిరు సంచి విత్తనం ఎండు తెగులును తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

మహిళ హత్య కేసులో వ్యక్తి అరెస్టు


నరసింహులు అరెస్టు చూపుతున్న పోలీసులు

మహదేవపూర్ : మహిళ హత్య కేసులో ఓ వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం పాత కక్షల నేపథ్యంలో మండలంలోని అంబట్‌పల్లి గ్రామానికి చెందిన నల్ల పద్మపై ఇదే గ్రామానికి చెందిన పుట్ట నరసింహులు గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలైన పద్మను వెంటనే ఆస్పత్రికి తరస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అయితే ఘటన అనంతరం నరసింహులు పారిపోతుండగా అంబట్‌పల్లి మేడిగడ్డ బ్యారేజీ సమీపంలో పట్టుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం గొడ్డలిని స్వాధీనం చేసుకుని నరసింహులును రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది ధనుంజయ్, అరుణ్, కిరణ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో తెలంగాణ ఉద్యమకారుడు..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రధాన నాయకుడిపై గురువారం లైంగికదాడి కేసు నమోదైంది. సదరు నాయకుడు తనపై లైంగికదాడికి పాల్పడ్డారని వంచనగిరికి చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

ఏపీలో రోడ్డు ప్రమాదం

- కొరివిపల్లికి చెందిన యువకుడి మృతి


నందు (ఫైల్)

పెద్దవంగర: ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కొరివిపల్లి గ్రామానికి చెందిన మట్టిపల్లి నందు(22) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నందు హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం గూడ్స్ వాహనంలో ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లికి వెళ్లాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో సత్తెనపల్లి శివారులోని హైదరాబాద్–విజయవాడ ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు ఐలమ్మ, ఉప్పలయ్య, ఇద్దరు సోదరులు ఉన్నారు.

గూడూరులో మరో యువకుడు..


దేవరాజు (ఫైల్)

కమలాపూర్: మండలంలోని గూడూరు శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరుకు చెందిన మండ దేవరాజు (24) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవరాజు బైక్‌పై గూడూరు నుంచి అంబాలకు వెళ్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. కాగా, ప్రమాదానికి అతి వేగమే కారణమని భావిస్తున్నారు.

జాతరలో నిరంతరం విద్యుత్ వెలుగులు

- ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి
- మేడారంలో విద్యుత్ ఏర్పాట్ల పరిశీలన

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మల మహాజాతరలో నిరంతరం విద్యుత్ వెలుగులు అందించేందుకు కృషి చేయాలని ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మేడారంలో విద్యుత్ శాఖ తరఫున జరుగుతున్న ఏర్పాట్లను ట్రాన్స్‌కో డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సీజీఎం మోహన్‌రావులతో కలిసి సీఎండీ పరిశీలించారు. మేడారం ఆర్టీసీ బస్టాండ్ ప్రదేశంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న విద్యుత్ ఏర్పాట్లపై అధికారులు సీఎండీ వరుణ్‌రెడ్డికి వివరించారు. మేడారం ఎండోమెంట్ అవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. జాతర జరిగే నాలుగు రోజుల సమయంలో అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో నిరంతరం విద్యుత్ సరఫరాపై ఆయన ఆరా తీశారు. ఏదైనా సాంకేతిక లోపం వల్ల విద్యుత్ నిలిచిపోయే సమయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వర్తించే సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా పని చేస్తారా అని అడిగారు. సిబ్బంది సౌకర్యాలపై ఆరా తీశారు. కొత్తగా ఏర్పాటుచేస్తున్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. విద్యుత్ సమస్య ఏర్పడితే క్షణాల్లో సరి చేసేందుకు కావాల్సిన సామర్థ్యాల పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.


సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి

అనంతరం కొత్తూరు సబ్‌స్టేషన్‌లో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

అమ్మవార్లకు పూజలు

సమ్మక్క– సారలమ్మలను ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి, డెరెక్టర్ మోహన్‌రెడ్డిలు దర్శించుకున్నారు. తొలిసారిగా మేడారానికి వచ్చిన ఆయన అమ్మవార్లకు, గోవిందరాజు, పగిడ్డిరాజులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయంగా పూజారులు డోలువాయిద్యాలతో గద్దెలపై స్వాగతం పలికారు. సీఎండీ వరుణ్‌రెడ్డికి సమ్మక్క పూజారి సిద్దబోయిన అరుణ్‌కుమార్ అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించి పట్టువస్త్రం, బెల్లం ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఎస్ఈ మల్చూర్‌నాయక్, డీఈ పులుసం నాగేశ్వర్ రావు, ఏడీఈ స్వామిరెడ్డి, ఏడీ వెణుగోపాల్, ఏఈ వేణుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాజాతరలో భక్తులకు వైద్యసేవలు

- డీహెచ్ రవీందర్‌నాయక్
- మేడారం జాతరలో నిర్వహించాల్సిన వైద్యశిబిరాలపై సమీక్ష


ములుగు : సమీక్షలో మాట్లాడుతున్న డీహెచ్ రవీందర్‌నాయక్

ములుగు : మేడారం మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీహెచ్) రవీందర్‌నాయక్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు భద్రాద్రికొత్తగూడెం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో ములుగు జిల్లా కేంద్రంలో మేడారం మహాజాతరలో చేపట్టనున్న వైద్య శిబిరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారంలో ఏర్పాటు చేయనున్న శిబిరాలలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వరంగల్, జనగామ, హనుమకొండ, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల నుంచి అవసరమైన సిబ్బందిని మహాజాతరలో విధులకు కేటాయిస్తామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలన్నారు. జాతర సమయంలో గర్భిణులు ప్రసవించే క్రమంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైతే జాతర నుంచి ఎమర్జెన్సీ సేవల కింద ములుగు ఏరియా ఆసుపత్రి, వరంగల్ ఎంజీఎంకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు గుండె పోటు, ఫిట్స్, ఆల్కాహాల్ సేవించి అపస్మారక స్థితికి చేరుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓలు పిల్లి సాంబశివరావు, శిరీష, ప్రశాంత్, మధుసూదన్, వెంకటరమణ, అంబరీష్, అల్లెం అప్పయ్య పాల్గొన్నారు.

డీహెచ్‌కు సన్మానం

తొలిసారి ములుగు జిల్లా కేంద్రానికి వచ్చిన డీహెచ్ రవీందర్‌నాయక్‌కు ములుగు జిల్లా సేవాలాల్ సేన తరఫున మర్యాద పూర్వకంగా కలిశారు. సేవాలాల్ చిత్రటాన్ని బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా అధికారి పోరిక రవీంద్రనాయక్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న డీహెచ్ రవీందర్‌నాయక్


తాడ్వాయి : సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్) రవీందర్ నాయక్ గురువారం దర్శించుకున్నారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. దర్శనం అనంతరం డీహెచ్‌ను పూజారులు సన్మానించి ప్రసాదం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి మేడారానికి వచ్చిన డీహెచ్ రవీందర్‌నాయక్‌కు డీఎంహెచ్‌ఓ అలెం అప్పయ్య స్వాగతం పలికారు. జాతరలో వైద్య సేవల ఏర్పాట్లపై డీఎంహెచ్‌ఓ అప్పయ్య.. డీహెచ్‌కు వివరించారు. వరంగల్ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, అధికారులు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి అనంతారం గ్రామంలో ఓ వృద్ధురాలు, హనుమకొండ జిల్లా పరకాల మండలం వెల్లంపల్లిలో మరో వృద్ధురాలు, ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలంలోని కె కొండాపురంలో యువకుడు, కాజీపేట దర్గా శివారులోని ఇందిరమ్మ కాలనీలో వ్యక్తి బలవన్మరణాలకు పాల్పడ్డాడు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

సాక్షి నెట్‌వర్క్


అనసూర్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : కడుపు నొప్పి భరించలేక ఓ వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి అనంతారం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రామడుగు అనసూర్య (68) రోజు మాదిరిగానే బుధవారం రాత్రి భోజనం చేసి తన గదిలోకి వెళ్లి నిద్రించింది. గురువారం తెల్లవారుజామున తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుమారుడు వెంకటాచారి తన తల్లిని పిలువగా ఆమె ఎంతకూ స్పందించలేదు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి గదిలోకి వెళ్లి చూడగా అనసూర్య ఉరివేసుకుని కనిపించింది. కడుపు నొప్పి భరించలేక మనస్తాపంతో అనసూర్య ఉరివేసుకుని మృతిచెందినట్లు కుటుంబీకులు గుర్తించారు. ఈ ఘటనపై మృతురాలి కూతురు లింగోజు శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. రూరల్ రెండో ఎస్సై కుమారస్వామి ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, అనసూర్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుండెనొప్పితో వెల్లంపల్లిలో మరో వృద్ధురాలు..

పరకాల: గుండెనొప్పి భరించలేక ఓ వృద్ధురాలి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం పరకాల మండలం వెల్లంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుర్రాల సుగుణ(75 గత కొద్దికాలంగా గుండెనొప్పితో బాధపడుతోంది. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొంది మందులు వాడుతోంది. అయినా తగ్గకపోవడంతో పరకాలకు వెళ్లివస్తానని కుటుంబీకులకు తెలిపి ఇంటి నుంచి బయటకు వచ్చిన సుగుణ గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు గుర్రాల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొండాపురంలో మద్యం మత్తులో యువకుడు..


చంటి మృతదేహం

వెకటాపురం(కె): మద్యం మత్తులో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కె కొండాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గామానికి చెందిన కురసం చంటి (22) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో కాజీపేటలో వ్యక్తి..

కాజీపేట: కాజీపేట 48 డివిజన్ కాజీపేట దర్గా శివారులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దేవర వెంకటేశ్వర్లు (42) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సార్ల రాజు కథనం ప్రకారం.. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో వైద్యం పొంది మందులు వాడుతున్నాడు. అయినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వర్ధన్నపేట: చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకటనర్సయ్య(65) మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని బీముని కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటి గుంతలో పడి గల్లంతయ్యాడు. దీంతో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు గజ ఈతగాళ్ల గాలించినా ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. అయితే గురువారం వెంకటనర్సయ్య మృతదేహం నీటిపై తేలియాడి లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి భార్య సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తకొండ జాతరను విజయవంతం చేయాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర రోడ్డు, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పి.ప్రభాకర్
- జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి: ఈనెల 10నుంచి 18వ తేదీ వరకు జరగనున్న భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల (జాతర)ను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో జాతర ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్తకొండ వీరభద్రస్వామికి ఎంతో విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఈనెల 10నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు పోలీసులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, పర్యాటక, విద్యుత్, దేవాదాయ, పర్యాటక తదితర అన్ని శాఖల అధికారులు బాధ్యతగా సమన్వయం, భక్తితో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేవాలయ ప్రతిష్ట గ్రామానికి, మండలానికి, జిల్లాకు పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తెలియజేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. దేవాదాయ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. నిరంతరం వైద్యసేవలు అందే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వీఐపీ దర్శనం కోసం రూ.50నుంచి రూ.100 టికెట్‌ను ఏర్పాటు చేస్తే దేవాలయ అభివృద్ధితోపాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఓరుగల్లులో కాకతీయుల కాలంనుంచి అనేక చారిత్రక దేవాలయాలు ఉన్నాయన్నారు. మేడారం, కొత్తకొండ, ఐనవోలు వంటి ఆలయాలు ఉన్నాయన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రభుత్వ ఆలయాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వరంగల్ సెంట్రజోన్ డీసీపీ ఎంఏ బారీ, ఆర్డీఓ రమేష్, డీపీఓ జగదీశ్వర్, శ్రీలత, సునీత, కిషన్‌రావు, ఎంపీడీఓ భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో పనిపేరుతో మోసం..

- రూ.2.44 లక్షలు స్వాహా
- హనుమాన్ నగర్‌లో ఘటన

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ నగర్‌కు చెందిన రాజుకు గత నెల 30వ తేదీన తన ఫోన్‌కు ఓ లింక్ వచ్చింది. దీనిని ఓపెన్ చేసిన తరువాత ఓ యువతి ఫోన్‌లో మాట్లాడింది. ఫోన్‌లోనే రోజుకు గంట పనిచేస్తే రూ.1000 వస్తాయని నమ్మబలికింది. అనంతరం మోసం చేసింది. ముందు ఆ యువతి రాజుకు రెండు, మూడు సార్లు డబ్బులు పంపింది. అనంతరం రాజు నుంచి రూ.2.44 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. ఈ ఘటనపై బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ గురువారం తెలిపారు.